నేడు కూరగాయల సంత వేలం

బెల్లంపల్లి, మార్చి 26 : మున్సిపల్ కార్యాలయం ఆవరణలో బుధవారం ఉదయం 11 గంటలకు కూరగాయల సంత (తైబజార్) బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ గోపు మల్లారెడ్డి తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి వేలం పాట నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు మరిన్ని వివరాల కోసం కార్యాలయ పని వేళల్లో సంప్రదించాలని సూచించారు.

నేడు రహదారి ప్రమాదాల నివారణకు సమావేశం

బెల్లంపల్లి, మార్చి 26 : బెల్లంపల్లి కన్నాల జాతీయ రహదారి 363పై జరుగుతున్న ప్రమాదాల నివారణకు బుధవారం అన్ని శాఖల అధికారులతో ఆర్డీవో కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో హరికృష్ణ తెలిపారు. కన్నాలలోని 68 డిప్ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఏర్పాటు చేస్తున్న సమావేశానికి జాతీయ రహదారుల అధికారులు, మండల, మున్సిపల్ స్థాయి అధికారులు, పోలీస్, రవాణా, రహదారులు, భవనాల శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని సూచించారు.

రైలు ఢీకొని ఒకరి మృతి

బెల్లంపల్లిరూరల్, మార్చి 26: బెల్లంపల్లి మండలంలోని కన్నాల గ్రామపంచాయతీ పరిధిలో తిరుమలహిల్స్ సమీపంలోని రైల్వేలైన్‌పై మంగళవారం గుర్తు తెలియని రైలు ఢీకొని రమేశ్ చిన్న (24) మృతి చెందాడు. చెవులకు హెడ్‌ఫోన్స్ పెట్టుకుని మాట్లాడుకుంటూ రైల్వేలైన్ పక్క నుంచి వెళ్తున్న రమేశ్ చిన్నాను వెనుక నుంచి రైలు ఢీకొట్టినట్లు తెలుస్తున్నది. మృతుడిది గడ్చిరోలి జిల్లా కాండీ గ్రామమని గుర్తించారు. ఈ సంఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రుల వద్దకు చిన్నారులు..

నెన్నెల, మార్చి 26 : సెల్‌ఫోన్ విషయంలో పిల్లలను తండ్రి మందలించడంతో అలిగిన ఇద్దరు చిన్నారులు అమ్మమ్మ ఇంటికి మండుటెండలో కాలినడకన ప్రయాణం చేశారు. నెన్నెల మండలం కుష్నపల్లి గ్రామానికి చెందిన ఒల్లాల గణేశ్, వసంత దంపతులకు ఇద్దరు పిల్లలు వైష్ణవి, శంకర్ ఉన్నారు. మంగళవారం ఇంట్లో సెల్‌ఫోన్ విషయంలో తండ్రి ఇద్దరు చిన్నారులను మందలించాడు. ఆ తర్వాత వ్యవసాయ పనులకు భార్య భర్తలు వెళ్లారు. పిల్లలు అలిగి ఇంట్లో ఎవరూలేని సమయం చూసి 30 కిలోమీటర్ల దూరంలో బెల్లంపల్లిలో ఉన్న అమ్మమ్మ ఇంటికి బయలుదేరారు. కుష్నపల్లి రోడ్డు వెంట కాళ్లకు చెప్పులు లేకుండా మండుటెండలో నెన్నెలకు చేరుకున్నారు. నెన్నెలకు చెందిన దుర్గం మల్లేశ్ వారిని ఆపి వివరాలు తెలుసుకొని పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్ వారికి పిల్లలను పోలీసులకు అప్పగించారు.

గంజాయి పట్టివేత

మందమర్రి, మార్చి 26: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వేస్టేషన్ వద్ద మంగళవారం నిర్వహించిన సోదాల్లో గంజాయి పట్టుకుని వివేక్‌రాజ్‌ను అదుపులోకి తీసుకున్నారు. మందమర్రి ఎస్ఐ ఎస్.రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం..రామగుండం సీపీ శ్రీనివాసులు, మంచిర్యాల డీసీపీ ఆదేశాల మేరకు మందమర్రి సీఐ శశీధర్ రెడ్డి ఆధ్వర్యంలో గంజాయి కట్టడికి తనిఖీలు నిర్వహించారు. రైల్వే స్టేషన్ వద్ద భగత్‌సింగ్ నగర్‌కు చెందిన డేగల వివేక్‌రాజ్ 500 గ్రాముల గంజాయితో పట్టుబడ్డాడు. అదుపులోకి తీసుకొని విచారించగా మహారాష్ట్రలోని చంద్రాపూర్ నుంచి తెచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్లు అంగీకరించాడు. ఈ మేరకు వివేక్‌రాజ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఇతనిపై గతంలో బెల్లంపల్లి వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో గంజాయి కేసు నమోదైందని సీఐ తెలిపారు.

అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు

బెల్లంపల్లిరూరల్, మార్చి 26: బెల్లంపల్లి మండలంలోని దుగినెపల్లి రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దుగుట అజయ్ (24) అంత్యక్రియలను మంగళవారం స్వగ్రామమైన మాలగురిజాలలో నిర్వహించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్, జిల్లా సమితి సభ్యులు మేకల రాజేశం, బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి అడెపు రాజమౌళి అంతిమయాత్రలో పాల్గొని అజయ్ కుటుంబసభ్యులను ఓదార్చారు.

పన్నుల వసూళ్లలో లక్ష్యం సాధించేనా..?

- చెన్నూర్ మున్సిపాలిటీలో ఇప్పటి వరకు 54శాతం మాత్రమే వసూళ్లు
- ఇంకా ఐదు రోజులే గడువు

చెన్నూర్ మున్సిపాలిటీ కార్యాలయం

చెన్నూర్, మార్చి 26: చెన్నూర్ మున్సిపాలిటీలో 20023–24 వార్షిక సంవత్సరానికి గాను వంద శాతం పన్నుల వసూళ్లకు అధికారులు కృషి చేస్తున్నప్పటికీ నిర్దేశించిన గడువులోపల లక్ష్యం చేరుకుంటారా? అనే సందేహం వ్యక్తమవుతున్నది. మున్సిపాలిటీలో ప్రస్తుత పన్నులు రూ.1.45 కోట్లు, బకాయి పన్నులు రూ.1.01కోట్లు కలిపి మొత్తం రూ.2.46 కోట్లు వసూళ్లు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు ప్రస్తుత పన్నులు, బకాయి పన్నులు కలిపి సుమారుగా రూ.1.30కోట్లు(54 శాతం) వసూళ్లు చేశారు. నిర్దేశించిన గడువుకు ఇంకా వారం రోజులు మాత్రమే మిగిలి ఉండడంతో 46 శాతం పన్నులు వసూళ్లు చేయాల్సి ఉంది.

పన్నుల వసూళ్ల విస్తృత ప్రచారం..

పన్నుల వసూళ్లను వంద శాతం సాధించేందుకు అధికారులు మాత్రం అనేక రకమైన చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలు పన్నులు చెల్లించాలని, బకాయి పడిన పన్నులపై 90 శాతం వడ్డీని మాఫీ చేస్తున్నామని, పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని వార్డుల్లో ఆటోల్లో తిరుగుతూ మైకుల ద్వారా ప్రచారం చేస్తున్నారు. పట్టణంలో పలు కూడళ్లల్లో పోస్టర్లను అతికించారు. మున్సిపాలిటీ సిబ్బందిని బృందాలుగా ఏర్పాటు చేసి వార్డుల్లో తిప్పుతూ ఇండ్ల వద్దకే వస్తూ పన్నులను వసూళ్లను చేస్తున్నారు. అయినప్పటికీ పన్నుల వసూళ్లలో 60శాతానికి చేరుకోలేకపోయారు. అధికారులు మాత్రం గడువు లోపల వంద శాతం చేరుకుంటామని చెబుతున్నారు. ఇంకా వసూళ్లు చేయాల్సిన పన్నుల్లో ప్రభుత్వ ఆస్తులకు సంబంధించినవి రూ.20 లక్షల వరకు ఉన్నాయని, కూల్చి వేయబడిన ఇండ్లకు సంబంధించిన పన్నులు రూ.18 లక్షల వరకు ఉన్నాయని అధికారులు తెలుపుతున్నారు. ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన పన్నులు, కూల్చి వేయబడిన ఇండ్లకు సంబంధించిన పన్నులను కలుపుకుంటే లక్ష్యాన్ని చేరుకున్నట్లేనని అధికారులు తెలుపుతున్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

బాధితునితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు

మంచిర్యాల ఏసీసీ, మార్చి 26: మంచిర్యాల పట్టణంలోని వార్డు నంబర్ 31 కి చెందిన శ్రీకాంత్ బల్దే (బబ్లూ) సోమవారం రోడ్డు ప్రమాదంతో గాయపడి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. శ్రీకాంత్‌ను మంగళవారం మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ పరామర్శించారు. సరైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. వారితో పాటు కౌన్సిలర్ గాదె సత్యం, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ సంచులు వాడితే చర్యలు

- నస్పూర్ మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీశ్

జరిమానా రసీదు అందిస్తున్న మున్సిపల్ సిబ్బంది

సీసీసీ నస్పూర్, మార్చి 26: కిరాణా షాపులు, సూపర్‌మార్కెట్‌లలో ప్లాస్టిక్ సంచులు వాడితే చర్యలు తప్పవని నస్పూర్ మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీశ్ హెచ్చరించారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని పలు షాపుల్లో సిబ్బంది తనిఖీలు చేశారు. ప్లాస్టిక్ గ్లాసులు, సంచులు అమ్ముతున్న ఓ సూపర్‌మార్కెట్‌కు రూ.1000 జరిమానా విధించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలోని వాణిజ్య, వ్యాపారులతో కమిషనర్ సమావేశమయ్యారు. 2016 ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్ ప్రకారం 120 మైక్రాన్‌ల కంటే తక్కువ మందం గల ప్లాస్టిక్ సంచులు, సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను ఎవరు వాడవద్దని సూచించారు. ఒక వేళ వాడితే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నర్సింహులు, జూనియర్ అసిస్టెంట్ పవన్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పెంపు

లక్సెట్టిపేట, మార్చి 26: తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకులంతో పాటు ట్రైబల్ గురుకులాల్లో 6 నుంచి 9వ తరగతి వరకు మిగిలి ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తుల గడువు ఈ నెల 30వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ లలితకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పూర్తి వివరాలకు 9704550167 నంబర్‌కు ఫోన్ చేయాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

- అదనపు కలెక్టర్ బీ రాహుల్

కాసిపేట : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ రాహుల్

కాసిపేట, మార్చి 26 : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ కేంద్రాల్లో సిబ్బంది, ఓటర్లకు వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ బీ రాహుల్ ఆదేశించారు. కాసిపేట మండలంలో మంగళవారం అడిషనల్ కలెక్టర్ పర్యటించారు. పోలింగ్ కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రం, గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. దేవాపూర్ గ్రామ పంచాయతీలోని డీఏవీ స్కూల్, కాసిపేట గ్రామ పంచాయతీలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి పిల్లలకు అందిస్తున్న పోషక పదార్థాలు, పుస్తకాలు, విద్యాభ్యాసంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాసిపేట గ్రంథాలయాన్ని పరిశీలించి విద్యార్థులకు అన్ని రకాల పుస్తకాలు, స్టడీ మెటీరియల్ అందుబాటులో ఉన్నాయా ? లేవా ? అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భోజన్న, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎంపీవో నాగరాజు, కార్యదర్శులు కవిత, సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

జన్నారంలో..

జన్నారం, మార్చి 27 : మండలంలోని బొమ్మెన, మహ్మదాబాద్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఆయా కేంద్రాల్లోని విద్యుత్ సరఫరాతో పాటుగా తాగునీటి వసతి ఇతర మౌలిక వసతులను పరిశీలించారు. ఓటు వేసేందుకు వచ్చిన వారికి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

బీఎల్వోలతో సమావేశం

సీసీసీ నస్పూర్, మార్చి 26: ఎన్నికల నేపథ్యంలో మండల బూత్ స్థాయి అధికారులతో నస్పూర్ తహసీల్దార్ శ్రీనివాస్ సమావేశమయ్యారు. మంగళవారం సీసీసీ సింగరేణి అతిథి గృహంలో నిర్వహించిన సమావేశంలో ఆయన బీఎల్వోలకు పలు సలహాలు, సూచనలు చేశారు. మున్సిపాలిటీలోని పోలింగ్ స్టేషన్ల వివరాలను బీఎల్వోలను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ స్టేషన్లలో కల్పించాల్సిన సౌకర్యాలు, ఓటరు లిస్టు సమస్యలు, పోలింగ్ స్టేషన్ లొకేషన్, కొత్త ఓటర్ల నమోదు వివరాలు తెలుసుకున్నారు. ఓటరు లిస్టులో చనిపోయిన వారు, షిఫ్ట్ అయిన వారు, రెండు సార్లు నమోదైనా వారి పేర్లు తొలగించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ పాల్గొన్నారు.

లక్సెట్టిపేటలో..

లక్సెట్టిపేట, మార్చి 26: పట్టణంలోని మండల పరిషత్ మీటింగ్ హాలులో మంగళవారం వివిధ శాఖల అధికారులతో పాటు బూత్ స్థాయి అధికారులతో లక్సెట్టిపేట తహసీల్దార్ రాఘవేంద్రరావు సమావేశం నిర్వహించారు. ఎండల దృష్ట్యా కేంద్రాల వద్ద టెంట్లు, తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం కల్పించాలని సూచించారు. ఓటరు జాబితాలో సవరణలు, పేర్ల నమోదు, తదితర మార్పులపై బీఎల్వోలు చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో సరోజ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు సరోజ, మధుసూదన్‌రావు, చైతన్య, మాణిక్‌రావు, గౌతం, కల్లెడ రాజశేఖర్, రామ్మోహన్, అతీశ్‌కుమార్, సూపర్‌వైజర్లు సమ్మక్క, నవీత్, జీవన్‌రెడ్డి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

వేమనపల్లిలో..

వేమనపల్లి, మార్చి 26 : మండల కేంద్రంతో పాటు దస్నాపూర్, రాజారాం, నాగారం, సూరారం, జిల్లెడ, లక్ష్మీపూర్ , బుయ్యారం, జక్కెపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం మండల తహసీల్దార్ రమేశ్, ఎస్ఐ శ్యాంపటేల్ సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లోని సౌకర్యాలను పరిశీలించారు. ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా తగిన సౌకర్యాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం 85 సంవత్సరాల వయస్సు పైబడిన వారి ఇంటి నుంచే ఓటు వేసేందుకు ఫారం 12డీ పంపిణీ చేసి సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మణ్, బీఎల్వోలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

లక్సెట్టిపేట, మార్చి 26: పట్టణంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థినులు మేస్రం లక్ష్మి, మడావి గాయత్రి, ఆకుల అమూల్య జాతీయ స్థాయి సైకిల్ పోలో క్రీడలకు ఎంపికైనట్లు క్రీడల అధికారి జీవరత్నం మంగళవారం తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొని జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 28 నుంచి 30 వరకు మహారాష్ట్రలోని నాగపూర్‌లో జరిగే జాతీయ స్థాయి సైకిల్ పోలో పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. విద్యార్థినులను పాఠశాల ప్రిన్సిపాల్ గఫార్, హెచ్‌డబ్ల్యూవో శోభారాణి, ఉపాధ్యాయులు అభినందించారు.

అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్‌లో ప్రతిభ

చెన్నూర్ రూరల్, మార్చి 26: కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ సెకండియర్ విద్యార్థి ఆసరెల్లి రవికిరణ్ అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. మార్చి 25 నుంచి 26వ తేదీ వరకు బెంగుళూరులోని కంఠీరవ స్టేడియంలో జరిగిన 6వ ఇండియన్ ఓపెన్ పారా అథ్లెటిక్స్ అంతర్జాతీయ చాంపియన్ షిప్ 2024లో నైపుణ్యం కల్పించి ఎఫ్–37 క్యాటగిరిలో డిస్కస్ త్రో ఈవెంట్‌లో 30 మీటర్ల విభాగంలో కాంస్య పతకం సాధించాడు. రవి కిరణ్‌ను ప్రిన్సిపాల్ శ్రీదేవి, అధ్యాపకులు అభినందించారు.

మా భూమి ఇప్పించండి

- బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయం ఎదుట బాధితుడి ఆందోళన

బెల్లంపల్లి, మార్చి 26: ఆకెనపల్లి శివారులోని సర్వే నంబర్–3లో గల రెండెకరాల 75 సెంట్ల భూమిని వేరే వారి పేరిట అక్రమంగా పట్టా చేశారని, తమకు న్యాయం చేయాలని అదే గ్రామానికి చెందిన జాడి తిరుపతి డిమాండ్ చేశాడు. ఈ మేరకు తన కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం బెల్లంపల్లిలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ఉరి తాళ్లతో నిరసన వ్యక్తం చేశారు. సమస్యకు పరిష్కారం చూపకపోతే అందరం కలిసి ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకెనపల్లి శివారులోని సర్వేనంబర్–3లో తన తాత (అమ్మ వాళ్ల నాన్న) దుర్గం లస్మయ్య పేరు మీద ఉన్న రెండెకరాల 75 సెంట్లను సోమగూడేనికి చెందిన భుక్యా రాంచందర్ తప్పుడు పత్రాలతో రెవెన్యూ అధికారులకు ముడుపులు ఇచ్చి దుర్గం లింగయ్య అనే పేరు మీద అక్రమంగా పట్టా చేయించుకున్నాడని జాడి తిరుపతి తెలిపాడు. 1956 నుంచి 2018 వరకు ఆన్‌లైన్‌లో తన తాత పేరు మీద ఉన్న భూమిని ఇతరులకు పట్టా ఎలా చేస్తారని ప్రశ్నించారు. ప్రస్తుతం తమ భూమి వద్దకు వెళ్తే రాంచందర్ తన అనుచరులతో కర్రలు, కత్తులు, గొడ్డళ్లతో తమపై దాడికి యత్నిస్తున్నారని, తమకు ప్రాణహాని ఉందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయమై కొన్ని నెలలుగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తునాన ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నాడు. ఇప్పటికైనా మా భూమి ఇప్పించకుంటే కుటుంబమంతా ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించాడు. ఇందుకు స్పందించిన ఆర్డీవో వెంట నే వారిని తన ఛాంబర్‌లోకి పిలుపించుకుని మాట్లాడారు. తహసీల్దార్‌ను విచారణ చేయాలని ఆదేశించామని ఆర్డీవో తెలపడంతో బాధితులు ఆందోళన విరమించారు.


బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న జాడి తిరుపతి, కుటుంబ సభ్యులు

ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

జైపూర్, మార్చి 26: శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ పొంది రెండు నెలల తర్వాతా గుండె పోటుతో మృతి చెందిన జైపూర్ మండలం టేకుమట్లకు చెందిన కొయ్యడ దేవేంద్ర కుటుంబానికి శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్ వారు మంగళవారం చెక్కును నామిని అయినటువంటి అతని కుమారుడు రాజకుమార్‌కు రూ, 5,87,250 విలువైన చెక్కుని అందజేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ఏజీఎం అట్ల సురేశ్, మాజీ సర్పంచ్ నర్సయ్య, పెద్దపల్లి బ్రాంచ్ మేనేజర్ వెంకట్రాజ్యం, మంచిర్యాల బ్రాంచ్ మేనేజర్లు గుండ రాజు, స్వాతి, డీవోలు వివేక్, చంద్రమౌళి, తిరుమల, గజ్జెల శ్వేత, బ్రాంచ్ ఎంప్లాయీస్ ప్రశాంత్, మహేందర్, గురజాల రంజిత్, గడికొప్పుల మహేందర్, మౌనిక తదితరులున్నారు.

గూడెం ఆలయ హుండీ లెక్కింపు

దండేపల్లి, మార్చి 26 : దండేపల్లి మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణ ఆలయంలో హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. 80 రోజులకు హుండీ ద్వారా రూ.6,23,103 ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, దేవాదాయశాఖ పర్యవేక్షణాధికారి రమేశ్, వంశపారంపర్య అర్చకులు గోవర్ధన సంపత్ స్వామి, రఘుస్వామి, వేద పండితులు నారాయణశర్మ, శ్రీసత్యనారాయణ స్వామి సేవా సమితి సభ్యులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలు చేయాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా


మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్, మార్చి 26: ప్రభుత్వ దవాఖానల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా పేర్కొన్నారు. మంగళవారం ఉట్నూర్‌లోని పీవో క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి జిల్లాలోని వైద్య ఆరోగ్య శాఖ 32 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంసీహెచ్ యాక్టివిటీస్, వ్యాధి నిరోధక టీకాలు, ఏఎన్‌సీ చెకప్, ఇమ్యూనిజేషన్ వంద శాతం పూర్తి చేయాలన్నారు. అలాగే వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. రోగులపై శ్రద్ధ వహించాలని సూచించారు. సమావేశంలో ఏజెన్సీ అదనపు వైద్యాధికారి బాలు, ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించేందుకు సహకరించాలి

- బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

కవాతు నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్, పోలీస్ బలగాలు

రామకృష్ణాపూర్, మార్చి 26: లోక్‌సభ ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సకరించాలని, అందుకు సబ్ డివిజన్ పోలీసులు సిద్ధంగా ఉన్నారని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మంగళవారం క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్ పట్టణంలోని మందమర్రి సర్కిల్ పరిధిలోని పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ రవికుమార్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో పట్టణ ప్రజలందరూ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు పోలీసు వారి నియమ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డి, ఎస్ఐలు బీ. రాజశేఖర్, ఆంజనేయులు, ప్రవీణ్ కుమార్, 100 మంది కేంద్ర బలగాలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు 99.60% హాజరు

మంచిర్యాల అర్బన్, మార్చి 26 : పదవ తరగతి వార్షిక పరీక్షల్లో ఐదవ రోజైన మంగళవారం భౌతిక, రసాయన శాస్త్ర పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 52 పరీక్షా కేంద్రాల్లో 99.60 శాతం విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 9,442 మంది విద్యార్థులకు గాను 9,404 మంది పరీక్ష రాసినట్లు డీఈవో యాదయ్య వెల్లడించారు.

ఇసుక ట్రాక్టర్‌లు సీజ్

కన్నెపల్లి, మార్చి 26 : అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం సీజ్ చేసినట్లు కన్నెపల్లి ఎస్ఐ గంగారాం తెలిపారు. టేకులపల్లి నుంచి జజ్జరవెల్లికి ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నామన్నారు. రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి ఇసుకను రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ గంగారాం తెలిపారు.

న్యాయం చేయండి..

- తప్పుడు కేసులు నమోదు చేశారని
- పోలీస్ స్టేషన్ ఎదుట వివాహిత బైఠాయింపు


కూతురుతో కలిసి బైఠాయించిన నాగశ్వేత

మంచిర్యాల ఏసీసీ, మార్చి 26: మంచిర్యాల పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట న్యాయం చేయాలని కోరుతూ ఓ వివాహిత మూడేళ్ల కూతురితో మంగళవారం ఉదయం బైఠాయించింది. మంచిర్యాల విద్యుత్ శాఖలో సబ్ ఇంజినీర్‌గా పని చేస్తున్న నాగశ్వేత తన తమ్ముడిపై పోలీసులు అన్యాయంగా కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేసింది. తన భర్త రాజ్‌కుమార్, కుటుంబ సభ్యులు తనపై వేధింపులకు గురి చేస్తున్నారని మంచిర్యాల పోలీస్‌స్టేషన్లో పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, కుటుంబ కలహాలతో మూడేళ్ల చిన్నారితో తన తల్లి వద్ద ఉంటున్న తనను భర్త రాజ్‌కుమార్ నిత్యం వెంటబడి వేధిస్తున్నాడని తెలిపింది. ఆ విషయంపై తన తమ్ముడు అన్వేష్ తన భర్తను నిలదీశాడని తెలిపారు. ఎలాంటి విచారణ చేయకుండా తన తమ్ముడిపై అన్యాయంగా కేసులు నమోదు చేశారని ఆరోపించింది. తన తమ్ముడిని అరెస్ట్ చేసి ఎస్ఐ మోకాళ్లపై నిలబెట్టాడని కన్నీటి పర్యంతమైంది. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి పూర్తి విచారణ చేసి తన భర్త, కుటుంబ సభ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరింది. అనంతరం పోలీసులు నచ్చజెప్పడంతో అక్కడి నుంచి వెళ్లిపోయింది. దీనిపై పట్టణ సీఐ బన్సీలాల్‌ను వివరణ కోరగా నాగజ్యోతి కేసుకు సంబంధించి స్టేట్‌మెంట్ తీసుకోవడానికి తనని స్టేషన్‌కు పిలిపించడంతో తనతో పాటు తన తమ్ముడు పోలీస్ స్టేషన్‌కు వచ్చారన్నారు. ఆమె తమ్ముడి పై గతంలో ఓ కేసు నమోదైందని అప్పటి నుంచి తప్పించుకుతిరుగుతున్నాడని ఆ కేసుకు సంబంధించి పోలీసులు 41ఏ నోటీసును ఇచ్చినట్లు తెలిపారు. దీనిపై పూర్తి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

సింగరేణి

ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత

- మందమర్రి ఏరియా రక్షణాధికారి రవీందర్

మందమర్రి ఏరియా రక్షణాధికారి రవీందర్

మందమర్రి, మార్చి 26: ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, రక్షణ చర్యలు తీసుకుంటూ విధులు నిర్వహించాలని సింగరేణి మందమర్రి ఏరియా రక్షణాధికారి ఎం.రవీందర్ కార్మికులకు సూచించారు. సింగరేణి మందమర్రి ఏరియాలోని కేకే–5గనిపై మంగళవారం నిర్వహించిన రక్షణ అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. విధి నిర్వహణలో రక్షణ సూత్రాలు పాటిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగవన్నారు. ముందుగా పని ప్రదేశాలను పర్యవేక్షించాలని పరధ్యానంతో పనుల చేస్తే ప్రమాదాలు సంభవిస్తాయని కార్మికుల ఆరోగ్యం, రక్షణ కంపెనీకి శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. ఇటీవల శ్రీరాంపూర్ ఏరియాలో జరిగిన ప్రమాదాల్లో కార్మికుడు మృతి చెందగా మరో కార్మికుడు రెండు కాళ్లను కోల్పోయాడని తెలిపారు. గనిలో హాలర్ డ్రైవర్ తాడు కమ్మర్ ఉద్యోగి సమన్వయంతో పని చేసుకోవాలని సూచించారు. శ్రీరాంపూర్‌లో తాడు మరమ్మతు పనులకు వెళ్లి తాడు కమ్మర్ ఉద్యోగి హాలర్ డ్రైవర్ మధ్య సమన్వయ లోపంతోనే ప్రమాదం జరిగిందని వివరించారు. ప్రమాద రహిత సింగరేణి లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అధికారులు, ఉద్యోగులు కలిసి కట్టుగా పని చేస్తూ ప్రమాద రహిత ఉత్పత్తిని సాధించాలని సూచించారు. అంతకు ముందు ఆయన గనిలో పని స్థలాలను, రక్షణ చర్యలను పరిశీలించారు. ఈ సమావేశంలో గని మేనేజర్ అల్లావుద్దీన్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఆర్కేపీ సీహెచ్‌పీలో లక్ష్యానికి మించి రవాణా

రామకృష్ణాపూర్, మార్చి 26: రామకృష్ణాపూర్ సీహెచ్‌పీలో 2023–2024 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన 22.3 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు రవాణా కాగా లక్ష్యాన్ని మించి 7 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు రవాణా చేసిన అధికారులు, ఉద్యోగులను మందమర్రి ఏరియా జీఎం మనోహర్ అభినందించారు. మంగళవారం ఆర్కేపీ సీహెచ్‌పీ ఏరియా జీఎం మనోహర్ సందర్శించారు. మార్చి నెలలో మిగిలిన రోజులలో ఇదేవిధంగా కష్టపడి రక్షణతో కూడిన బొగ్గు రవాణా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఈ చంద్రమౌళి, సూపర్వైజర్లు గంగధర్, కల్లెపల్లి శ్రీనివాస్, వేణు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలివ్వాలి

సీసీసీ నస్పూర్ / శ్రీరాంపూర్, మార్చి 26: కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో తెలంగాణ కార్మిక శాఖ డైరెక్టర్ కృష్ణాఆదిత్యకు వినతి పత్రం అందజేశారు. అనంతరం యూనియన్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మిక శాఖ ద్వారా విడుదల చేసి ప్రిలిమినరీ నోటిఫికేషన్‌లో పొందుపర్చిన వేతనాల ప్రతిపాదన సక్రమంగా లేదని, తక్షణమే ఉపసంహరించుకుని 2021 జూన్ లో విడుదల చేసిన జీవో 22 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వివిధ రంగాల్లో అనేక మంది కాంట్రాక్ట్ కార్మికులు చాలీచాలని వేతనాలతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. నోటిఫికేషన్‌లో ఉన్న అంశాలపై తాము అభ్యంతరాలను, ప్రతిపాదనలను కార్మిక శాఖ డైరెక్టర్‌కు లిఖితపూర్వకంగా అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు యర్రగాని కిష్టయ్య, ఎస్కే గౌస్, దొడ్డిపట్ల రవీందర్, తదితరులున్నారు.

అధికారులపై ఆరోపణలు మానుకోవాలి

శ్రీరాంపూర్, మార్చి 26 : గనులు, ఓసీపీల్లో జరిగే ప్రమాదాలకు కేవలం అధికారులనే బాధ్యులను చేస్తూ చర్యలు తీసుకోవాలని కొందరు డిమాండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని సింగరేణి కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. ప్రమాదాలు అనేక కారణాల వల్ల జరుగుతాయని, డీఎంఎస్ అధికారులు విచారణ చేసి బాధ్యులైన వారిపై చట్టపరంగా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారని తెలిపారు. అప్పటి వరకు అధికారులపై ఆరోపణలు చేయడం, నిందించడం సరికాదన్నారు. అధికారుల మనోస్థైర్యం దెబ్బ తింటుందన్నారు. శ్రీరాంపూర్‌లో డిప్యూటేషన్ బదిలీల్లో ఎలాంటి ప్రలోభాలు లేకుండా నిబంధనలకు అనుగుణంగా చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఎలాంటి అనుమానాలు, ఆరోపనలున్నా విజిలెన్స్ విభాగం, యాజమాన్యానికి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. మహిళా ఉద్యోగుల సంరక్షణ కొరకు ఇంటర్నల్ ఫిర్యాదు సెల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమస్యలుంటే ఆధారాలతో ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉపకార వేతనాలు, బోధన ఫీజులు రాక విద్యార్థుల ఆత్మహత్యలు

మంచిర్యాల అర్బన్, మార్చి 26 : పెండింగ్‌లో ఉన్న బోధన ఫీజులు, ఉపకార వేతనాలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. మంగళ వారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు ఉపకార వేతనాలు రాక కళాశాలల్లో యాజమాన్యం సర్టిఫికెట్లు ఇవ్వలేని పరిస్థితితులు దాపురించాయని, దీంతో విద్యార్థులు ఆందోళనకు గురై ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ట్రెజరీల్లో నిలిచిన 1500 కోట్ల టోకెన్లు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ ఏడాది బడ్జెట్ లెక్కల్లో ఈ నెల 31లోగా విడుదల కాకుండా ప్రభుత్వం చేతులెత్తేసే పరిస్థితి కనబడుతున్నదన్నారు. ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్ షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీను, అజయ్ సాయి, అభి తదితరులు పాల్గొన్నారు.

బీట్ అధికారులకు చట్టాలపై శిక్షణ

మంచిర్యాల ఏసీసీ, మార్చి 26: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కెమిస్ట్ భవన్‌లో తెలంగాణ ఫారెస్ట్ అకాడమీకి చెందిన 34వ బ్యాచ్ ఫారెస్ట్ బీట్ అధికారులకు వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ 1972, తెలంగాణ ఫారెస్ట్ యాక్ట్ 1967 పైన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్ గా హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ అండ్ సెంటర్ ఫర్ వైల్డ్ లైఫ్ స్టడీస్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ రామిండ్ల తిరుపతి అడ్వొకేట్ హాజరై శిక్షణ ఇచ్చారు. ఇలాంటి శిక్షణపై చట్టాలపై అవగాహన కలుగుతుందని బీట్ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇక్కడ అడ్వొకేట్ నటేశ్వర్, మంచిర్యాల ఫారెస్ట్ రేంజ్ అధికారి రత్నాకర్, ట్రైనీ ఫారెస్ట్ బీట్ అధికారుల ఇన్‌చార్జి అధికారి అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

జన్నారం, మార్చి 26 : మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద పొనకల్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రాన్ని పంచాయతీ కార్యదర్శి రాహుల్ ప్రారంభించారు. మండల కేంద్రానికి వచ్చే ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.